జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com


# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



సోమవారం | 18-11-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 167 పేజీలు: 8 వెల: రూ.7


# పెద్దబజార్.. దర్జా




*** పొట్టి శ్రీరాములు మార్కెట్ బయటే వ్యాపారం * తోపుడుబళ్ల వ్యాపారులదే హవా * రోడ్డుకు అడ్డంగా బళ్లు * ఎవరైనా నిలదీస్తే దాడులు * నిత్యం ట్రాఫిక్ జామ్ * చోద్యం చూస్తున్న మున్సిపల్, పోలీసు యంత్రాంగం**

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 17 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్ (పెద్దబజార్) ఆవరణ ఆక్రమణకు గురైంది. కొందరు తోపుడుబళ్ల వ్యాపారులు యధేచ్ఛగా రోడ్డుపైనే బళ్లు పెట్టుకుని వ్యాపారం చేసుకుంటున్నారు. దీనివల్ల మున్సిపల్ షాపుల్లో కిరాణా, తదితర వ్యాపారాలు చేసుకుంటున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన పొట్టి శ్రీరాములు మార్కెట్ లోపల పెద్ద ఎత్తున షాపింగ్ కాంప్లెక్స్ ఖాళీగా ఉంటోంది. ఆవరణ మాత్రం నిత్యం రద్దీగా ఉంటోంది. కనీసం ద్విచక్రవాహనం లోపలికి వెళ్లాలన్నా,




పాదచారులు వెళ్లాలన్నా ఇబ్బందులు పడాల్సివస్తోంది. అక్కడ తోపుడుబళ్ల వ్యాపారుల హవా నడుస్తోంది. ఎవరైనా నిలదీస్తే వీరు దాడులకు దిగుతున్నారు. అంతా మా ఇష్టం అనే విధంగా వ్యవహరిస్తున్నారు. తోపుడుబళ్లను అడ్డదిడ్డంగా పెట్టడం వల్ల నిత్యం ట్రాఫిక్ జాం అవుతోంది. లక్షలు పోసి షాపులు దక్కించుకున్నామని, తోపుడుబళ్ల నిర్వాహకుల వల్ల ఇబ్బందులు పడుతున్నామని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్యను మున్సిపల్ అధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని మున్సిపల్ షాపుల్లో అద్దెకు ఉంటున్న వ్యాపారులు లబోదిబోమంటున్నారు. పెద్దమార్కెట్లోకి వెళ్లాలంటే కొనుగోలుదారులు సైతం అవస్థలు పడుతున్నారు. రోడ్డుకు అడ్డంగా తోపుడు బళ్లు తీయమంటే చాలు.. కొందరు కస్సుమంటూ గొడవకు వస్తున్నారు. దీనివల్ల నిత్యం మార్కెట్లో వాగ్వాదాలు, దాడులు జరుగుతున్నాయి. మున్సిపల్ అధికారులు, పోలీసు అధికారులకు వీరి నుంచి నెలవారీ మామూళ్లు అందుతుండడంతో చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని కొందరు వ్యాపారులు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. దీనికితోడు ఓటు రాజకీయ కారణంగానే ప్రజాప్రతినిధులు సైతం మాకెందుకులే ఈ గొడవ అన్న రీతిగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు.



# 104 సిబ్బంది కష్టాలు




*** సమస్యలతో సతమతమవుతున్న సిబ్బంది * అరకొర వేతనాలు.. సక్రమంగా అందక ఆర్థిక ఇబ్బందులు * కొరవడిన ఉద్యోగ భద్రత * అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యలు * వివిధ రూపాల్లో నిరసనలు * 30 నుంచి సమ్మెబాట**

**సోంపేట, నవంబర్17(వార్త):** అరకొర వేతనాలతో గడచిన 16 ఏళ్లుగా ప్రజలకు సేవలు అందిస్తున్న 104 సిబ్బంది ఉద్యోగభద్రత లేక అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. డ్రైవర్లు, డీఈవోలుగా చాలా కాలంగా సేవలు అందిస్తున్నా సరైన గుర్తింపు లేదు. అవుట్ సోర్స్, కాంట్రాక్ట్ ఉద్యోగుల కంటే తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారు. పనికి తగ్గట్టు వేతనాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని 104 సిబ్బంది కోరుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా మొర వినేవారే కరువయ్యారు. ఒకవైపు విధులు నిర్వహిస్తునే.. మరోవైపు వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేస్తున్నా స్పందించడం లేదు. దీంతో సమ్మె బాట పట్టేందుకు సిబ్బంది సన్నద్ధమవుతున్నారు. ఈనెల 30 లోపు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించుకుంటే సమ్మెబాట పడతామని హెచ్చరికలు చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో 120 మంది వరకూ 104 వాహన డ్రైవర్లు, డీఈవోలు విధులు నిర్వహిస్తున్నారు.



## డిమాండ్లు ఇవే..

ప్రతి నెల 104 సిబ్బందికి వేతనం సక్రమంగా చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలి. జీవో నెంబర్ ఏడు ప్రకారం ఇందులో పనిచేస్తున్న డ్రైవర్లు, డీఈవోలకు వేతనాలు చెల్లించాలి. మూడేళ్లగా యాజమాన్యం ఆధీనంలో ఉంచుకున్న ఇంక్రిమెంట్లను ఏరియర్స్ రూపంలో ఇవ్వాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పనికి తగ్గ వేతనం చెల్లించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలని లేకుంటే సమ్మె బాట పడతామని 104 ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ నారాయణరావు, ప్రధాన కార్యదర్శి డి.కిరణ్, ట్రెజరర్ నరేష్ కుమార్ డిమాండ్ చేశారు.

# కడుపుకోత

*** పుట్టినరోజు నాడే కానరాని లోకాలకు * ఊబిలో కూరుకుపోయి ఆరేళ్ల బాలుడు మృత్యువాత * కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు**



**శ్రీకాకుళం క్రైం, నవంబర్17 (వార్త):** పుట్టినరోజు నాడే విగతజీవిగా మారి కన్నోళ్లకు కడుపుకోత మిగిల్చిన ఘటన శ్రీకాకుళం రూరల్ మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం రూరల్ మండలంలోని గూడెం పంచాయతీ రామనర్సుంపేట గ్రామానికి చెందిన మొల్లి సోమశేఖర్(6) ఆదివారం సాయంత్రం సోదరుడు భార్గవ్, మరో బాలుడితో కలిసి ఇంటి సమీపంలో ఆడుకుంటున్నాడు. ఓ పొలం వద్ద ఉన్న గుంతలో కనిపించిన గుంతలో కలువపూలను చూసి తీసేందుకు దిగాడు. పూలను తీసే క్రమంలో ఊబిలో కూరుకుపోయాడు. వెంటనే సోదరుడు భార్గవ్ ఈవిషయమై తల్లిదండ్రులకు చెప్పడంతో వారు వచ్చి సోమశేఖర్‌ను బయతకు తీసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. స్థానికులు ఈ విషయాన్ని శ్రీకాకుళం రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రాము తెలిపారు. సోమశేఖర్ తండ్రి రాజు కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కాగా, ఆదివారం సాయంత్రం ఇంటి వద్ద కుమారుడి పుట్టినరోజు వేడుక చేసేందుకు తాము ఏర్పాట్లు చేసుకుంటున్నామని, ఇంతలోనే కుమారుడు మృత్యువాత పడ్డాడని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## గాయపడిన విద్యార్థినికి రూ.10వేల సాయం



**మందస, నవంబర్ 17(వార్త):** గొల్లలపాలెం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని నర్తు కరిష్మా ఇటీవల ఆటో ప్రమాదంలో గాయపడింది. ఆమె వైద్య ఖర్చులకు శ్రీపవనపుత్ర సేవాసంస్థ వారు రూ.10వేలను ఆదివారం అందించారు. విద్యార్థినికి సహాయం అందించిన ప్రతీ ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదములు సంస్థ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మజ్జి భాస్కరరావు, కొల్లి పాల్గుణరావు, రాపాక కేశవరావు, రెల్ల ఉమామహేశ్వరరావు, బద్రి వసంత్, గంగిట్ల దేవరాజు, కొర్నాన ధనుంజయ, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇసుక తోడేస్తున్నారు..!

■ తలగాం రేవు నుంచి భారీ లారీలతో అక్రమంగా తరలింపు ■ పట్టించుకోని అధికారులు

**వంగర, నవంబర్17(వార్త):** వంగర మండలంలోని తలగాం గ్రామం వద్ద గల నాగావళి నది నుంచి భారీ లారీలతో అక్రమంగా ఇసుక తరలించేస్తున్నారు. పట్టపగలే ఈ అక్రమ రవాణా సాగుతుండడం గమనార్హం. ఇదే రేవు నుంచి లారీలతో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా అక్టోబర్ 3న పోలీసులు పట్టుకొన్న సంగతి అందరికీ తెలిసిందే. అప్పటి నుంచి కాస్త తగ్గిన అక్రమార్కులు మళ్లీ విజృంభించారు. ఇంత యథేచ్ఛగా ఇసుకను తరలించడంలో ఎవరి హస్తం ఉందో అని మండల వాసులు గుసగుసలాడుకుంటున్నారు. మండలంలో ఉన్న వేగావతి, నాగావళి, సువర్ణముఖి నదుల్లోని రేవుల వద్ద నుంచి పెద్దమొత్తంలో ట్రాక్టర్లతో అక్రమ ఇసుక తరలిస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. భారీ వాహనాలతో ఇసుక పట్టపగలే తరలిస్తున్నా సంబంధిత అధికారులు జాడ కనిపించ లేదు. మైనింగ్ అధికారులు పూర్తిగా పట్టించుకోలేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మైనింగ్ అధికారులే గాకుండా మండల స్థాయి అధికారులు కూడా పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజాం వెళ్లే ప్రధాన రహదారి మీద నుంచే ఇసుకను ఇతర పట్టణాలు, ప్రాంతాల్లో విక్రయించేందుకు తరలిస్తున్నారు. ఈ అక్రమ తరలింపునకు చెక్ పెట్టాల్సిన బాధ్యత మైన్స్, మండల స్థాయి అధికారులపై ఎంతైనా ఉంది. దీనిపై అధికారులు ఏ చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.



# మంచినీళ్లపేటలో టీడీపీ నేతల దాష్టీకం

■ వైసీపీ వర్గీయులపై దాడి ■ ముగ్గురికి తీవ్ర గాయాలు
■ పలాస ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు ■ పరామర్శించిన మాజీ మంత్రి సీదిరి




**పలాస, నవంబర్ 17(వార్త):** వజ్రపుకొత్తూరు మండలం మంచి నీళ్లపేటలో టీడీపీ నేతలు వైఎస్సార్సీపీ వర్గీయులపై దాష్టీకానికి తెగబడ్డారు. ఈ ఘర్షణలో ఇద్దరు మహిళలు, మరో యువకుడిని గాయపడి పలాస ప్రభుత్వాస్పత్రిలో చేరారు. వివరాలిలి ఉన్నాయి.

ఆ గ్రామానికి సంబంధించిన నగదు ఖర్చులు, జమ వివరాలపై శనివారం గ్రామకమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రావాలని వైఎస్సార్సీపీ కార్యకర్త గూడేం చిన్నారావుకు టీడీపీ నేతలు కబురు పంపారు. దీంతో చిన్నారావు, ఆయన మేనత్తలు రట్టి లక్ష్మమ్మ, కదిరి నీలమ్మ కూడా వెళ్లారు. అయితే టీడీపీ నేతలంతా కలిసి వారిపై దాడి చేశారు. 2023లో మంచినీళ్లపేట పర్యటనకు వచ్చిన గౌతు శిరీషను నిలదీశారనే కక్షతో వారిపై కక్ష పెట్టుకుని దాడికి తెగబడ్డారని బాధితులు తెలిపారు. గాయపడిన వారు పలాస ప్రభుత్వం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిని పార్టీ నాయకులతో కలిసి మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదివారం పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# పలాసలో వృద్ధాశ్రమానికి భూమి పూజ

**పలాస, నవంబర్ 17(వార్త):** పలాసలో వృద్ధాశ్రమం నిర్మాణం కోసం పద్మనాభపురం వద్ద గల దత్త అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అమ్మ ఆశ్రమ వ్యవస్థాపకులు మాట్లాడుతూ అమ్మ తల్లి ఆశీస్సులతో వృద్ధాశ్రమం పూర్తి చేస్తామని, దీనికి దాతలు ముందుకు రావాలని కోరారు, కొండే నరసింహ మాట్లాడుతూ స్థల దాత పెంట నాగేశ్వరరావు సహకారంతో శంకుస్థాపన చేశామని, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరు కూడా ముందుకు వచ్చి తమ సహాయ సహకారాలు అందించి కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బత్తిని హేమేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది పైల రాజరత్నంనాయుడు, తెలుగుదేశం పార్టీ పట్టణ సీనియర్ నాయకులు కామేష్ యాదవ్, స్థానికులు డొక్కర మాధవరావు స్వామీ, బతకల శ్రీను, కొండే తిరుపతిరావు, బతకల పులి రాజు, గుసిరి వీరాస్వామి, డొక్కరి సత్యనారాయణ, దుబ్బ రాజగోపాల్, సంపత్‌రావు జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## స్కిల్ హబ్ సెంటర్‌లో ఉపాధి కోర్సులు




**పలాస, నవంబర్ 17(వార్త):** పలాసలోని స్కిల్ హబ్ సెంటర్ డాక్టర్ కణితీస్ ప్రభుత్వ ఐటీఐ నందు ఎలక్ట్రీషియన్, డొమెస్టిక్ సొల్యూషన్ కోర్సులను ప్రారంభించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ జవహర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్హత కలిగి, 18 నుంచి 30 ఏళ్లలోపు గల విద్యార్థులు అర్హులన్నారు. కోర్స్ పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్ తో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. అర్హత గల అభ్యర్థులు సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు, రెండు పాస్‌పోర్టు ఫొటోస్ తీసుకు రావాలని సూచించారు.

## ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి స్థల సేకరణ



**పలాస, నవంబర్ 17(వార్త):** ఎయిర్‌పోర్టు ఏర్పాటు కోసం చీపురుపల్లి పంచాయతీ పరిధిలోని మోట్టూరులో స్థలాన్ని శనివారం పలాస ఆర్డీవో వి.వెంకటేష్ పరిశీలించారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి 1383 ఎకరాల స్థలం అవసరం ఉన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఇటీవల మంచినీళ్లపేటలో జరిగిన పల్లెపండగ కార్యక్రమంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు జిల్లాకు ఎయిర్‌పోర్టును మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిన విషయంవిదితమే. ఈమేరకు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి స్థలం పరిశీలించి నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామని ఆర్డీవో తెలిపారు.

## 23న ఉచిత అక్షరాభ్యాసాలు



**పలాస, నవంబర్ 17(వార్త):** సత్యసాయి బాబా జన్మదిన పురస్కరించుకొని పలాస మండలం రామకృష్ణపురంలో గల సత్యసాయి విద్య విహార్ నందు 23న ఉచితంగా అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్నామని స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ మల్ల రామేశ్వరరావు తెలిపారు. అక్షరాభ్యాస సామగ్రి కూడా తామే ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ఆసక్తి గల వారు తమ స్కూల్‌నందు పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

## మానవత్వంతో ఆదుకోండి

**పలాస, నవంబర్ 17(వార్త):** పలాసలోని 27వ వార్డుకు చెందిన ఉల్లాస్ పేట వాసి బైక్ మెకానిక్ నిరంజన్‌కు రోడ్డు ప్రమాదంలో ఎడమ కాలు, ఎడమ చేయి విరిగిపోయాయి. దీంతో ఆ కుటుంబానికి కష్టాలు చుట్టుముట్టాయి. ఈ విషయం తెలుసుకున్న పలువురు ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. పెంట కృష్ణప్రసాద్ రేషన్ అందజేశారు. సుధీర్‌సాహుకారు రూ.1000లు అందించారు. ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ఆ కుటుంబానికి తమ సహాయం చేయాలని వారు కోరుతున్నారు.



## పేద విద్యార్థికి కిల్లంశెట్టి శ్రీనివాస్ ఆర్థిక సాయం

**మందస, నవంబర్ 17(వార్త):** మందసలోని పొందర వీధికి చెందిన పొందర ప్రభాకర్, జానకి దంపతుల 11ఏళ్ల పొందర ధనుష్.. తన గుండెలో రంధ్రం ఉండడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న మందసకు చెందిన కిల్లంశెట్టి శ్రీనివాస్(వాసా)ధనుష్ కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న శ్రీనివాస్ దాతృత్వం చాటుతూనే ఉన్నారు. ఇటీవల ఆయన తల్లిదండ్రులు కిల్లంశెట్టి సీతారాం, పుష్పవతి పేరిట మందసలో పునర్నిర్మాణం జరుపుకుంటున్న శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఐకానిక్ భవనానికి రూ.లక్షను విరాళంగా అందజేశారు. శ్రీనివాస్ కూడా రూ.10వేలను అందజేశారు. కిల్లంశెట్టి కుటుంబాన్ని స్థానికులు అభినందించారు.





## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**మందస, నవంబర్ 17(వార్త):** మందసలోని శాఖాగ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ జె.విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞానాన్ని వెలికి తీయడానికి ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గ్రంథాలయం సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎం.ధర్మారావు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీముఖలింగం దక్షిణ ద్వారం వద్ద తొక్కిసలాట



**జలుమూరు, నవంబర్ 17(వార్త):** శ్రీముఖలింగం దేవస్థానం దక్షిణ ద్వారం వద్ద ఆదివారం భక్తుల మధ్య తొక్కిసలాట జరిగింది. అనేక ప్రాంతాల నుంచి స్వామిని దర్శించేందుకు వచ్చినవారు, క్యూలైన్లు పాటించకుండా స్వామిని దర్శించి దక్షిణ ద్వారం ద్వారా వచ్చే భక్తులకు ఆటంకం కలిగించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. గర్భగుడి నుంచి దర్శనం పూర్తిచేసుకుని వస్తున్న వారిని తోసుకుంటూ ఇటునుంచి దర్శనానికి వెళ్లడంతో ఘర్షణలు జరిగాయి.

## ఆంజనేయ విగ్రహం నిర్మిస్తాం




**కాశీబుగ్గ, నవంబర్ 17(వార్త):** బ్రాహ్మణతర్లా ఆటోస్టాండ్ కూడలిలో అభయ ఆంజనేయస్వామి విగ్రహా నిర్మాణానికి ఆదివారం అమ్మ ఆశ్రమం ప్రతినిధులు. రామానంద స్వాముల వారి బృందం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విగ్రహ నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## నవ్య ఆత్మహత్యపై తహసీల్దార్ విచారణ

**కాశీబుగ్గ, నవంబర్ 17(వార్త):** పలాస మండలం ఈదురాపల్లి గ్రామంలో అత్తవారింట ఆత్మహత్యకు పాల్పడిన ఉపాధ్యాయురాలు శాసనపురి నవ్య ఉదంతంపై పలాస తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి ఆదివారం విచారణ చేపట్టారు. అత్త, మామలు, ప్రత్యక్ష సాక్షులు, గ్రామస్థులు, భర్తను విచారించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. విచారణ మొత్తం వీడియో రికార్డింగ్ చేశారు. ఆత్మహత్య వ్యవహారంపై ఎవరికైనా అనుమానాలు ఉంటే తెలియజేయాలని తహశీల్దార్ వారిని కోరారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. సంఘటన స్థలానికి ఉపాధ్యాయ సంఘాల నాయకులు చేరుకొని నివాళులర్పించారు. మంచి ఉపాధ్యాయురాలిని తాము కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు. సీఐ డి.మోహనరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## వైసీపీ నాయకుడు గొర్లె ఆకస్మిక మృతి

మందస, నవంబర్ 17(వార్త): వీరగున్నమ్మపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, గ్రామీణ వైద్యుడు గొర్లె వేణుగోపాలరావు(62) ఆదివారం ఆకస్మికంగా మరణించారు. షుగర్ వ్యాధితో బాధ పడుతున్న ఆయన ఒక్కసారిగా అనారోగ్యానికి గురయ్యారు. చికిత్స అందించేలోపే మృతి చెందారు. ఆయనకు భార్య హేమలత(విమలకుమారి), ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతిపై వీజీ పురం, కుంటికోట సర్పంచ్‌లు కర్రి గోపాలకృష్ణ, దుంపల వైకుంఠరావు, కోఆప్షన్ సభ్యుడు యవ్వారి నాగేశ్వరరావు, వల్లభ అశోక్ సంతాపం తెలిపారు.



# బాలియాత్ర ఘనంగా ప్రారంభం



**జలుమూరు నవంబర్ 17(వార్త):** ప్రముఖ పుణ్య క్షేత్రం శ్రీముఖలింగంలో ఆదివారం శతాబ్దాల చరిత్ర కలిగిన బాలి యాత్రను పునఃప్రారంభించారు. ఇండోనేషియాకి చెందిన నది బాలి ద్వీపానికి నౌకల ద్వారా ఆనాటి కళింగ రాజ్యపాలనలో వ్యాపారం చేసేవారు కార్తీక పౌర్ణమి సందర్భంగా బయలుదేరి మళ్లీ శివరాత్రికి తిరిగి వచ్చేవారిని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ జీవితేశ్వరరావు తెలిపారు. వీరు క్షేమంగా వెళ్లి లాభంగా రావాలని వారి కుటుంబసభ్యులు శ్రీముఖలింగంలోని వంశధార తీరంలో పితృదేవతలకు దీపోత్సవం జరిపి వేడుకునే వారని తెలిపారు. దీనినే బాలి యాత్రగా పిలిచేవారన్నారు. ఆనాటి సంప్రదాయాన్ని ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఆ ప్రాచీన సంప్రదాయాన్ని వునః ప్రారంభించడమే ఈ యాత్ర ఆశయ లక్ష్యమని అన్నారు. యాత్రకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా సర్పంచ్ తమన్నగారి సతీష్, దేవాలయ అర్చకులు, శ్రీముఖలింగ గ్రామస్థులు పలు ఏర్పాట్లు చేశారు. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు శ్రీముఖలింగేశ్వర దర్శనం అనంతరం నదీతీరంలో దీపారాధన నిర్వహించారు. అర్చకులకు సన్మానం చేశారు. కార్యక్రమానికి జిల్లాలోనే గాకుండా ఒడిశా ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తజనం తరలివచ్చారు. కార్యక్రమంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ అధ్యక్షుడు రోణంకి కృష్ణంనాయుడు, జడ్పీ చైర్‌పర్సన్ పి.విజయ, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి ఎస్.అప్పలరాజు, వైసీపీ నేత పేడాడ తిలక్, శ్రీముఖలింగం మాజీ సర్పంచ్ టి.బలరామ్, దేవా మాస్టర్, గుంట కర్ణవీరుడు, సీహెచ్ కేశవ తదితరులు పాల్గొన్నారు.





# సాదాసీదాగా మందస మండల సమావేశం




**మందస, నవంబర్ 17(వార్త):** మందస మండల సర్వసభ్య సమావేశం ఆదివారం ఎంపీపీ డొక్కరి దానయ్య అధ్యక్షతన సాదాసీదాగా జరిగింది. ప్రొటోకాల్‌పై సభ్యులు ప్రశ్నించగా.. అధికారులు సరైన సమాధానం ఇవ్వలేదు. వైస్ ఎంపీపీ సీర ప్రసాద్ ఈ విషయమై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్‌లను గౌరవించకపోవడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. ఉచిత గ్యాస్‌పై కోఆప్షన్ సభ్యుడు యవ్వారి నాగేశ్వరరావు ప్రశ్నించారు. హరిపురం సీహెస్‌సీలో వైద్యంపై బాలిగాం సర్పంచ్ తలగాన చంద్రశేఖర్, పిడిమందస ఎంపీటీసీ సభ్యుడు వాయలపల్లి మాధవరావు నిరసన వ్యక్తం చేశారు. వైద్యం సరిగా అందడంలేదని, సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కాగా, సభ్యులు రిజిస్టర్లలో సంతకాలు పెట్టి వెళ్లిపోవడానికి ఎక్కువ ఉత్సాహం చూపారు. కొంతమంది అధికారులు రాకుండా సిబ్బందిని సమావేశానికి పంపించడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కొంత మంది సభ్యులు కుర్చీలకే పరిమితమయ్యారు. సమావేశం యావత్తూ తూతూమంత్రంగా సాగింది. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు సవర చందమ్మ, ఎంపీడీవో పైల సూర్యనారాయణ, తహసీల్దార్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

# 21న భిలాయ్‌లో ప్రపంచ మత్స్యకార దినోత్సవం

**సోంపేట, నవంబర్ 17(వార్త):** భిలాయ్‌లో ఈనెల 21న ప్రపంచ మత్స్యకార దినోత్సవం ఘనంగా నిర్వహించాలని భిలాయ్ ఎస్టీ సాధనసమితి ఏకగ్రీవంగా నిర్ణయించింది.

భిలాయ్, కేంప్-1లో భిలాయి తెలుగు సమాజ భవనం వద్ద ఆదివారం సాయంత్రం భిలాయ్ మత్స్యకారుల సామాజిక సంస్థ అధ్యక్షుడు బర్రి జోగారావు గారి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి యెరిపల్లి భాస్కరరావు, సమన్వయకర్త మొరిపల్లి బాబూరావు మత్స్యకార సామాజిక సంస్థ (సాధన సమితి) భిలాయ్‌లో ఏర్పాటుకు గల కారణాలు వివరించారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కార్యక్రమంలో కోశాధికారి కంబాల పాపా రావు, సలహాదారులు కర్రి ఉమాశంక ర్ రావు, ఉపాధ్యక్షులు కన్నం రాజేంద్ర, ఉప కార్యదర్శి సీహెచ్ గణపతిరావు, బైపల్లి అప్పారావు, లండ చైతన్య, బి.వెంకట, ముత్తి కృష్ణ, మైలపల్లి ఈశ్వ రరావు, వై.కృష్ణారావు, కె.రామకృష్ణ, డి.యేసయ్య, మూగి వెంకటరావు తది తరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



## వంగర కేజీబీవీని సందర్శించిన ఎంఈవో

వంగర, నవంబర్ 17(వార్త): వంగర కస్తూర్బాగాంధీ బాలికల జూనియర్ కాలేజీని ఆదివారం ఎంఈవో యాగాటి దుర్గారావు సందర్శించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయినులకు ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో కళాశాల ప్రత్యేకాధికారిణి, ఉపాధ్యాయినులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ముడుపులిస్తేనే పని చేస్తారా..?

■ తహసీల్దార్ కార్యాలయ తీరుపై వంగర మండల సభ్యుల మండిపాటు ■ సమావేశానికి తహసీల్దార్ రాకపోవడంపై ఆగ్రహం ■ అధికారుల వైఖరిపై ధ్వజం ■వాడీవేడిగా మండల సమావేశం



**వంగర, నవంబర్17(వార్త):** ముడుపులు ఇవ్వనిదే తహసీల్దార్ కార్యాలయంలో ఏ పని కావడం లేదని మండల సభ్యులు ధ్వజమెత్తారు. ఎంపీపీ ఉత్తరావల్లి సురేష్‌ముఖర్జీ అధ్యక్షతన ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం గరం..గరంగా సాగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు ముడుపులపై తహసీల్దార్ ధర్మరాజు తీరును ఎండగట్టారు. ఈయన బాధ్యతలు చేపట్టాక కార్యాలయం పూర్తిగా అవినీతిమయమైందని మండిపడ్డారు. ప్రతి పనికీ ఓ రేటు పెట్టి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. తహసీల్దార్ సమావేశానికి హాజరుకాకపోవడంపై డీటీ రమణారావును నిలదీశారు. కావాలనే సమావేశానికి ఎగ్గొట్టారని వారు ధ్వజమెత్తారు. పద్ధతి మార్చుకుని పని చేయకుంటే ఇబ్బందులు తప్పవని, అవసరమైతే ధర్నాచేస్తామని సభ్యులు హెచ్చరించారు. తహసీల్దార్..ప్రజా ప్రతినిధులతో వారంలోపు సమావేశం ఏర్పాటు చేసేలా చూడాలని డిమాండ్ చేశారు. మద్దువలస జూనియర్‌కాలేజీ, జగన్నాథవలస పాఠశాలల్లో ఆయాల తొలగింపుపై మద్దువలస సర్పంచ్ ప్రతినిధి బూరాడ వెంకటరావు ఎంఈవోను నిలదీశారు. దీనిపై ఎంపీపీ ఎంపీపీ సురేష్‌ముఖర్జీ మాట్లాడుతూ ఎస్ఎంసీ తీర్మానం లేకుండా ఎలా చేశారని ఎంఈవోపై మండిపడ్డారు. దీనికి ఆయన సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. బియ్యం తరుగు రావడంతో డీలర్లు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ సురేష్ ముఖర్జీ సీఎస్ డీటీ పిన్నింటి రామారావును ప్రశ్నించారు. బియ్యం తూకం వేసి డీలర్లు పట్టుకెళ్లాలని ఆయన బదులివ్వగా, కాటా పాడైతే ఎలా తూకం వేస్తారని ఎంపీపీ.. ఆయనను నిలదీశారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని డీటీ తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ మాట్లాడుతూ మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈవోపీఆర్‌డీ కెల్ల రామారావు మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు కృషి చేస్తున్నానని తెలిపారు. ఏపీవో ఎం.సత్యవతి సభలో మాట్లాడుతూ ఉపాధి హామీపై సభ్యులకు వివరించారు. మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలకు కలెక్టర్‌కు నివేదించాలని ఎంపీడీవోను ఎంపీపీ ఆదేశించారు. కార్యక్రమంలో ఏవో కన్నబాబు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వివిధ పోటీలు



ఇచ్ఛాపురం, నవంబర్ 17(వార్త): ఇచ్ఛాపురంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థులపై సెల్ ఫోన్ ప్రభావం అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో స్వర్ణ భారతి, మోడల్ స్కూల్, బాలికోన్నత పాఠశాలల నుంచి 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. లైబ్రేరియన్ పూర్ణచంద్ర బెహేరా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆసి గౌరీ శంకర్ రెడ్డి, రవిశంకర్ మహాపాత్రో, జాని, సత్యనారాయణ బెహరా పాల్గొన్నారు.

**సారవకోట:** సారవకోట గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు కథలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు ఇటువంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయన అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సాయమ్మ, దుర్గాజి, పలువురు విశ్రాంతి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





**జలుమూరు, నవంబర్ 17(వార్త):** సారవకోట మండల టీడీపీ కార్యాలయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు చిత్ర పటానికి పలువురు నివాళులర్పించారు. అనంతరం పార్టీకి ఆయన చేసినసేవలను కొనియాడారు. ఆయన ఆత్మకు ప్రశాంతత చేకూరాలని దేవుడిని ప్రార్థించారు.

# మాజీ ఎమ్మెల్యేకు నివాళులు

**కాశీబుగ్గ:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోదరుడు రామ్మూర్తినాయుడు అనారోగ్య కారణంతో మృతిచెందిన విషయం తెలిసిన పలాస నియోజకవర్గ నాయకులు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కార్యాలయంలో ఆయనకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ నాయకులు పి.విఠల్, లొడగల కామేశ్వరరావు, సప్ప నవీన్, గాలి కృష్ణారావు, వంకల మాధవరావు, అనిల్ శర్మ, రవి శంకర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



## వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సహస్ర సుందరాకాండ పారాయణం



**నరసన్నపేట, నవంబర్ 17(వార్త):** నరసన్నపేట పంచాయతీ కార్యాలయ గాంధీ మండపంపై ఆదివా రం ఘనంగా సహస్ర సుందరాకాండ పారాయణం నిర్వాహకులు చేపట్టారు. తొలుత వేంకటేశ్వరస్వామికి తిరువీధి నిర్వహించారు. అనంతరం గాంధీ మండపంపై స్వామిని కొలువుచేసి పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సతీమణి సుగుణమ్మ మాట్లాడుతూ.. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమం చేపట్టడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ పారాయణం వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు నమోదైనట్లు కార్యక్రమ ప్రతినిధి రూప్ నాథ్ తెలి పారు. ఆదివారం అవార్డును నిర్వాహకురాలు సంతోషికి అందజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలో ఎక్కడ కూడా 1,016 మందితో నాలుగు గంటల పాటు సుందరా కాండ పారాయణం నిర్వహించలేదని, ఇదే ప్రథమం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా ముగించిన స్థానికులను ఆయన అభినందించారు.

## పాముకాటుకు గురై రైతుకు అస్వస్థత



**మెళియాపుట్టి, నవంబర్ 17(వార్త):** మెళియాపుట్టికి చెందిన రైతు సిరిపురం లచ్చన్న పాముకాటుతో అస్వస్థతకు గురయ్యాడు. ఒడిశా సరిహద్దు దవిడిగాం గ్రామంలోని తన పొలంలో ఆయన వరిచేను కోస్తుండగా పాము కాటేసింది. దీంతో ఆయన కేకలు వేయగా, అక్కడ పనిచేస్తున్న వారు వెంటనే ద్విచక్ర వాహనంపై మెళియాపుట్టి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకువచ్చారు. స్టాఫ్ నర్స్ శకుంతల ప్రథమచికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

## విద్యార్థి కుటుంబానికి ఆర్థికసాయం




**సారవకోట, నవంబర్ 17(వార్త):** సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తమతో చదువుకున్న విద్యార్థి కుటుంబానికి తోటి విద్యార్థులు ఆదివారం ఆర్థిక సహాయం అందించారు. 1995-96 విద్యా సంవత్సరంలో సారవకోట ఉన్నత పాఠశాలలో చదివిన దున్న పార్థసారథి ఇటీవల మృతి చెందాడు. శ్రీకాకుళంలో ఉన్న వారి కుటుంబసభ్యులకు ఆదివారం ఆనాటి స్నేహితులు రూ.60,000 ఆర్థికసాయాన్ని అందించారు. ఏ అవసరమైన తాము అందుబాటులో ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

## నరసన్నపేట ఏఎస్ఐగా సింహాచలం



**నరసన్నపేట, నవంబర్ 17(వార్త):** నరసన్నపేట ఏఎస్ఐగా సింహాచలం ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో బాధ్యతగా ఉంటానన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చిన తాను అండగా ఉంటానన్నారు. ఆయనకు పలువురు అభినందలను తెలిపారు.

## అక్రమ వసూళ్లు అడ్డుకోండి



**జలుమూరు, నవంబర్ 17(వార్త):** శ్రీముఖలింగంలో వెలసిన శ్రీముఖలింగే శ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తుల నుంచి అక్రమ ఆశీలు వసూలు చేస్తున్నారని స్థానికుడు తండాశి ఢిల్లేశ్వరరావు ఆరోపించారు. ఫోర్ వీలర్స్‌కు రూ.30 వసూ లు చేయాల్సి ఉండగా, రూ.50 వసూలు చేస్తున్నారని తెలిపారు. వాహనాలకు అక్రమంగా నగదు వసూళ్లు చేస్తున్నారని విమర్శించారు. సంబంధిత ప్రజా ప్రతి నిధులు, అధికారులు స్పందించి ఈ వసూళ్లను నిలుపుదల చేయాలని కోరారు.

## వీఆర్ఏ నేతల గృహ నిర్బంధం

**వంగర, నవంబర్ 17(వార్త):** వీఆర్ఏలు సోమవారం చలో విజయవాడకు పిలుపునివ్వడంతో వంగర వీఆర్ఏ ప్రసాద్, వీఆర్ఏ సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు వై.అప్పలస్వామిని వారి స్వగ్రామం రాజులగుమ్మడలో ఆదివారం పోలీసులు గృహ నిర్బంధం చేశారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ధర్మం కోసమే హైందవ శంఖారావ సభ

**పోలాకి, నవంబర్ 17(వార్త):**ధర్మం కోసం వచ్చే ఏడాది జనవరి నెల మొదటివారంలో హైందవ శంఖారావ సభను నిర్వహించనున్నామని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ కరుకోల సీతారాం అన్నారు. ఆదివారం పోలాకి శ్రీరామమందిరం వద్ద సమావేశం అయ్యారు. జనవరి నెలలో విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావ భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. కార్యకర్త ఎల్ గౌరిశంకర్ మాట్లాడుతూ ప్రతీ హిందువు ఈ సభకు తరలిరావాలని కోరారు. సమావేశంలో చిన్నప్పన్న, శశిభూషన్ రావు, ఈశ్వరరావు పలువురు పాల్గొన్నారు.



# 29న చలో శ్రీకాకుళం

* జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ
* ఎస్సీ /ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి వెల్లడి
* విజయవంతం చేయాలని పిలుపు
* కరపత్రాల ఆవిష్కరణ

**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 17 (వార్త):** చలో శ్రీకాకుళం కార్యక్రమాన్ని ఈ నెల 29న చేపట్టనున్నామని, విజయవంతం చేయాలని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఎస్సీ /ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పిలుపునిచ్చింది. సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో 7 రోడ్ల కూడలి నుంచి జిల్లా పరిషత్ మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆదివారం శ్రీకాకుళం ఇలిసిపురంలో ఉన్న అంబేద్కర్ విజ్ఞాన మందిర్లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆర్. అప్పారావు, వాడాన కృష్ణారావు, గుణాపు ఇల్లయ్య, కల్లేపల్లి రాంగోపాల్, జిల్లా ఎస్సీ /ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ తైక్వాండో శ్రీను, కో కన్వీనర్ కంఠ వేణు, రాయి వేణుగోపాల్, బోనెల రమేష్, బొడ్డేపల్లి భూపతిరావు, యజ్జల గురుమూర్తి, సీర రమేష్ బాబు, చీర రాజేశ్వరి, గండి ఉమామహేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, టి.గోవిందరావు, కె.రామారావు, బొత్స భాస్కరరావు, పంకు ప్రసాద్, లుట్ట విజయ కుమార్, రేగాన రామకృష్ణ, యడ్ల జానకి రావు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వర్గీకరణపై సుప్రీంకోర్టు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఇచ్చిన తీర్పును రాష్ట్రపతి నిలుపుదల చేయాలని దేశంలో ఉన్న 40 కోట్ల పైబడిన దళిత గిరిజన ప్రజలు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. దేశవ్యాప్తంగా ఎస్సీ/ ఎస్టీ వర్గీకరణ ను వ్యతిరేకిస్తూ, రాజ్యాంగబద్ధమైన హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్న క్రమంలో ఈనెల 29వ తేదీన శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న భారీ ర్యాలీ, బహిరంగ సభకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో వేలాదిగా దళిత, గిరిజన ప్రజలు హాజరై విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.



## రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

**ఇచ్ఛాపురం, నవంబర్ 17(వార్త):** పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ గోడౌన్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళితే.. బలరాంపేటకి చెందిన యువకుడు ఉయ్యాల వంశీకృష్ణ (23) అతని బావ బెర్హంపూర్ కి చెందిన అంగురు కృష్ణ ( 25) ఇరువురు ద్విచక్ర వాహనంపై బెర్హంపూర్ వైపు నుండి వస్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌కి సమాచారం ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వంశీకృష్ణ మృతి చెందినట్లు చెప్పారు. మృతుని బావ పరిస్థితి విషమంగా ఉండటంతో బెర్హంపూర్ ఎం కె సి జి ఆసుపత్రికి తరలించారు. వంశీ తండ్రి చిన్నప్పుడే మరణించగా తల్లి సుగుణ ఉన్నారు. బట్టల షాప్ లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు.



# ఎర్రముక్కాం టు నేపాల్

* జాతీయ సమైక్యత కోసం కామేశ్వరరావు బైక్ పర్యటన

**సోంపేట, నవంబర్17 (వార్త):** సోంపేట మండలం ఎర్రముక్కాం గ్రామానికి చెందిన ఆర్ఎస్ఎస్ కార్యకర్త, బీజేపీ జిల్లా యువజన ప్రతినిధి పుక్కళ్ల కామేశ్వరరావు జాతీయ సమైక్యత కోసం బుల్లెట్ వాహనంలో స్వగ్రామం నుంచి ఈనెల ఎనిమిదో తేదీన తన ప్రయాణం సాగించి ఆదివారం రాత్రికి ఖాట్మండు చేరుకున్నారు. ఇప్పటిదాకా పలు రాష్ట్రాల మీదుగా ప్రయాణించిన ఆయన 3,630 కిలోమీటర్లు ప్రయాణించారు. పూరి, కోణార్క్, లింగరాజు ఆలయం, కోల్కత్తా, డార్జిలింగ్, చిలుకూరి, నేపాల్ పశుపతి ఆలయం, ముక్తినాథ్ టెంపుల్, కాట్మండు ఎయిర్పోర్ట్, తదితర ప్రాంతాల మీదుగా తన ప్రయాణం కొనసాగించి జాతీయ సమైక్యత కోసం ఆయా ప్రాంతాల్లో ప్రచారం చేశారు. భారత దేశంలో అత్యంత శక్తివంతమైన ప్రధానమంత్రిగా గుర్తింపు పొందిన నరేంద్ర మోడీ ఆశయాలను ఈ సందర్భంగా వారితో పంచుకున్నారు. జాతీయ సమైక్యతే ధ్యేయంగా తాను ఈ ప్రయాణాన్ని ప్రారంభించానని తెలిపారు. దేశ ప్రయోజనాల కోసం మోడీ పడుతున్న కష్టంలో తాను పడుతున్నది కొద్ది మాత్రమేనని అన్నారు. తాను ప్రయాణించే అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు మద్దతు పూర్తిస్థాయిలో లభించడం ఆనందంగా ఉందని, ప్రధాని మోడీ పేరు చెపుతుంటే వారంతా సంతోషం పడుతున్నారని కామేశ్వరరావు అన్నారు.









### పంచారామాలకు
# ప్రత్యేక బస్సులు

**(శ్రీకాకుళం నవంబర్ 17(వార్త):** పంచారామాలకు వెళ్లే ఆర్టీసీ ప్రత్యేక బస్సులను శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆదివారం ఆర్టీసీ శ్రీకాకుళం 1, 2 డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కెఆర్ఎస్ శర్మలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక మాసంలో ప్రతి ఆదివారం సాయంత్రం 4 గంటలకు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పంచారామాల ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయన్నారు. ఈ సర్వీసులో టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలో గల శివాలయాల దర్శనానికి వెళ్తారని చెప్పారు. ఈ నెల 24వ తేదీనాడు కూడా పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. 17వ తేదీ ఆదివారం జిల్లా నుంచి పంచారామాలకు నాలుగు బస్సులు బయలుదేరినట్లు తెలిపారు. 'ఒక్క ఫోన్ కాల్ తో మీ వద్దకు ఆర్టీసీ బస్సు' అనే నినాదంతో ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు పేర్కొ న్నారు. మరిన్ని వివరాలకు 99592 25608, 9959225609, 9959225610, 9959225611 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, టెక్కలి అసిస్టెంట్ మేనేజర్ పీఎస్ఎన్ మూర్తి, శ్రీను, ప్రసాద్, ఎం.పి.రావు, సెక్యూరిటీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ
# వికేంద్రీకరణ

* మండల, మున్సిపల్ స్థాయిలో నిర్వహణ
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**(శ్రీకాకుళం నవంబర్ 17(వార్త):** ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ సోమవారం నుండి మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించుకోవచ్చన్నారు. ప్రజలకి పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

## అరసవల్లికి పోటెత్తిన భక్తజనం

**అరసవల్లి, నవంబర్ 17 (వార్త):** ప్రత్యక్ష దైవం సూర్యనారాయణ స్వామిని దర్శించుకునేందుకు ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. క్యూలైన్లు కిటకిటలాడాయి. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు దీరారు. స్వామి వారికి టికెట్లు రూపేనా రూ.4,21,20, పూజలు, విరాళాల రూపంలో రూ.1,66,572, ప్రసాదాల రూపంలో రూ.3,12,09 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు.





Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546